క్లుప్తంగా

బీజేపీలో చేరిన డాక్టర్ టి.వి.రావు



గుంటూరు మెడికల్: దాక్షిణ్య మానసిక వికలాంగుల ఆశ్రమం వ్యవస్థాపకులు, వాణిజ్య పన్నుల శాఖ మాజీ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి.వి.రావు, బీజేపీలో చేరారు. మంగళవారం గుంటూరు శ్రీకన్వెన్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా, డాక్టర్ టి.వి.రావు గతంలో టీడీపీ తరుపున పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): 11 కేవీ లైన్ షిఫ్టింగ్ దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. గుజ్జనగుండ్ల, ఎస్వీఎన్ కాలనీ, శ్యామలానగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

18 నుంచి డీటీపీలో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి డీటీపీ, 25వ తేదీ నుంచి ఉమెన్స్ టైలరింగ్, సెప్టెంబర్ ఒకటి నుంచి బ్యూటీ పార్లర్ మెనేజ్‌మెంట్, 8వ తేదీ నుంచి సెల్‌ఫోన్ రిపేర్స్ అండ్ సర్వీసెస్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 సంప్రదించాలని కోరారు.

మత్తు పదార్థాలకు బానిస కాకూడదు



పట్నంబజారు: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె.వెంకటప్రసాద్ చెప్పారు. పాతగుంటూరులోని ఏపీఆర్‌జేసీ పాఠశాల, కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వలన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా నష్టపోతారన్నారు. వ్యసనాలకు బానిసలై బంగారు జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటివి విక్రయించినా, రవాణా చేసినా, తాగినా కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడి, పోలీసు రికార్డుల్లో పేరు నమోదైతే భవిష్యత్ నష్టపోతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.సి.ప్రసాద్ పాల్గొన్నారు.

బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణను ఆపాలి

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



నెహ్రూనగర్: బిహార్‌లో రెండు నెలలుగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణను తక్షణమే నిలిపివేసి, వలస కార్మికుల ఓటు హక్కును కాపాడాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. మంగళవారం జనచైతన్య వేదిక హాలులో బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు ఓటు హక్కును కల్పించాల్సిన భారతీయ ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా దాదాపు 32 లక్షలమంది వలస కార్మికుల ఓటు హక్కును హరించి వేయడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు ఇటీవల ఓటర్ల నమోదులో ఆధార్ కార్డ్, ఎన్నికల గుర్తింపు కార్డు, రేషన్ కార్డులను పరిగణలోకి తీసుకోవాలని పేర్కొనడం హర్షణీయమన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 'ముట్టడి'



కొత్తపేట విద్యుత్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

లక్ష్మీపురం: స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఉద్యమం గుంటూరు నగరంలో తీవ్ర రూపం దాల్చింది. విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లకు రద్దు చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొత్తపేటలోని విద్యుత్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించాయి. డీఈఈ ముస్తాక్ అహ్మద్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, సీఐటీయూ నగర కార్యదర్శి ముత్యాలరావు, ఉపాధ్యక్షులు నళినీకాంత్, ప్రజాపోరు నాయకులు మేకల రవి, రైతు కూలీ సంఘం నాయకులు నరసింహారావు మాట్లాడారు. గతంలో ఉన్నటువంటి మీటర్లను మార్చే క్రమంలో ప్రభుత్వాలు ఆ మీటర్ యొక్క ఖర్చును ప్రభుత్వమే భరించేదని, కానీ ప్రస్తుతం పారిశ్రామికవేత గౌతం అదానీకి లాభాలు చేకూర్చడం కోసమే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని ఆగ్రహం వక్తం చేశారు. ప్రజలకు భారంగా మారనున్న స్మార్ట్ మీటర్లను బిగించడం కుదరదని తమిళనాడు ప్రభుత్వం చెప్పిందని, ప్రజా వ్యతిరేకత చవిచూసిన పశ్చిమబెంగాల్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు ఉపసంహరించుకుందన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను కూడా పట్టించుకోకుండా స్మార్ట్ మీటర్లను బిగించే ప్రయత్నం చేయడం అత్యంత దారుణం అని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ముందుకు తీసుకెళ్తే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకునేంత వరకు, ట్రూ అప్ చార్జీలను రద్దుచేసి కరెంటు బిల్లులను తగ్గించేంత వరకు ఈ ఉద్యమం ఆగదని ప్రకటించారు. ప్రజలందరూ కరెంటు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు పాల్గొన్నారు.

వార్డు సచివాలయ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

కమిషనర్ పులి శ్రీనివాసులు



తాళం వేసి ఉన్న సచివాలయం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, కార్యాలయ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం కమిషనర్ శనక్కాయల ఫ్యాక్టరీ దగ్గరలోని 32, 33, 38, కుగ్లర్ హాస్పిటల్ రోడ్‌లోని 34, గుంటూరు వారితోట లోని 29, 30, 34, 38 వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి సచివాలయ కార్యదర్శుల హాజరు సక్రమంగా లేకపోవడం, పని వేళల్లో మూవ్మెంట్ రిజిస్టర్‌లో నోట్ చేయకుండా వెళ్లడం గమనించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఎవ్వరూ లేకుండా తాళం వేసిన 34వ వార్డు సచివాలయ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఇక నుంచి వార్డు సచివాలయాలను ప్రతి రోజు ఆకస్మిక తనిఖీలు చేస్తామని, కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ సర్వేలు, ఇతర కార్యక్రమాలు ఉంటే తప్పనిసరిగా మూవ్మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సెలవులు తమ నోడల్ అధికారి, విభాగ అధికారి ద్వారా మంజూరు చేసుకోవాలని కోరారు.

డంపింగ్ యార్డులో పచ్చదనం పెంపుపై దృష్టి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని ఏటుకూరు రోడ్‌లోని డంపింగ్ యార్డుని సమగ్ర సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డంపింగ్ యార్డ్‌ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏటుకూరు రోడ్ లోని డంపింగ్ యార్డ్‌ని చెత్త నిర్వహణలో ఆదర్శంగా, ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలనికోరారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి పాల్గొన్నారు.

మేల్ స్టాఫ్ నర్సు దాడి చేశాడంటూ ఫిర్యాదు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో మేల్ స్టాఫ్‌నర్సుగా పనిచేస్తూ సీఎం కాన్వాయిలో విధులు నిర్వహిస్తున్న ఎం.ప్రభాకర్ తనపై దాడిచేశాడంటూ సీఎం కాన్వాయి డ్రైవర్‌గా పనిచేస్తున్న కె.సునిల్‌కుమార్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈనెల 4న విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం నుంచి సీఎం కాన్వాయి మెడికల్ టీమ్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొస్తున్న సమయంలో మేల్ స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ఎం.ప్రభాకర్ తనను తాడేపల్లిలో దించాలని తనతో వాగ్వివాదం పెట్టుకుని దాడి చేసి, బూతులు తిట్టారంటూ ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. మేల్ స్టాఫ్‌నర్సు వలన తనకు ప్రాణ హాని ఉందని, తోటి ఉద్యోగులు, వైద్యుల ముందు తనపై దాడిచేసి అవహేళనగా మాట్లాడిన ప్రభాకర్‌పై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలంటూ డ్రైవర్ ఫిర్యాదు చేశాడు.

అధికారులకు పీ4 కష్టాలు



నెహ్రూనగర్: పేదలను ఉన్నత స్థాయికి తీసుకువస్తామని ప్రచారం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం 'పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్– పీ4 పథకం అమలుకు నానా అవస్థలు పడుతున్నారు. ఉగాది సందర్భంగా అట్టహాసంగా మొదలైన ఈ పథకం.. సంపన్న వర్గాల నుంచి స్పందన లేదు. ఈ నెల 15వ తేదీలోగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొస్తోంది. దీంతో నగరపాలక సంస్థ అధికారులు దాతలను అన్వేషించే పనిలో నిమగ్నమయ్యారు. అయినా ఫలితం లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. గుంటూరు నగరంలో 50 వేల బంగారు కుటుంబాలను గుర్తించారు. ప్రస్తుతం వీరికి కేవలం సుమారు పది వేల మంది మాత్రమే మార్గదర్శకులను గుర్తించినట్లు సమాచారం. ఈ నెల 15వ తేదీ నాటికి మార్గదర్శకుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. ఇప్పటికే ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడంతో వారు దీనిని వ్యతిరేకించడంతో మీకు ఇష్టమైతేనే ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇక కాంట్రాక్టర్లు, డాక్టర్లు, బిల్డర్ల వద్దకు వెళ్లి మార్గదర్శకులుగా చేరాలని అధికారులు కోరుతున్నారు.

సుంకాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

లక్ష్మీపురం: ఆగస్టు ఒకటి నుంచి భారత ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం అదనపు దిగుమతి సుంకం విధించడం పెనాల్టీని కూడా విధిస్తానని హెచ్చరించటం భారత్‌పై అతని వ్యతిరేక భావానికి నిదర్శనమని రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సుంకాల విధింపుపై చర్చా కార్యక్రమం నిర్వహించారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలి



మాట్లాడుతున్న శేఖర్‌బాబు

నగరంపాలెం: సామజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఎన్‌జీఓ కాలనీలోని పీహెచ్‌సీలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు మత్తుపదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాదకద్రవ్యాల వాడకంతో జీవితాలు నాశనం చేస్తాయని అన్నారు. నిత్య జీవితంలో పలువురు విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని పేర్కొన్నారు. అవగాహనతో మాదక ద్రవ్యాల వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. మత్తు పదార్థాలు విద్యార్థుల జీవితాన్ని నాశనం చేస్తాయని చెప్పారు. మొదట సరదాగా అలవాటై చివరికి మత్తు పదార్థాలు లేకుండా జీవించలేని పరిస్థితులు వస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ సామజిక బాధ్యతగా బావిస్తే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చునని తెలిపారు. చిన్న వయసు నుంచే మొబైల్ ఫోన్లు వాడకం వలన పిల్లల్లో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. శారీరకంగా, మానసికంగా వారిపై ప్రభావం చూపిస్తుందని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న జీటీఏ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ(జీటీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఎం షరీఫ్, డి.యల్లమందరావు పేర్కొన్నారు. మంగళవారం ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డిని కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్జేడీ కార్యాలయంలో కలిసిన జీటీఏ నాయకులు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ఎంఈఓలుగా అదనపు బాధ్యతలపై నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్జేడీని కలిసిన వారిలో జీటీఏ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.చలపతిరావు, ఎంఈఓలుగా నియమితులైన ఎన్.ఉషాకుమారి, కేఏస్ఎన్ ప్రసాద్, జు.సుదేష్‌బాబు, డి.రాజు, జీటీఏ నాయకులు జి. కృష్ణ, సీహెచ్ లక్ష్మణరావు, కె.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.అజయ్, సి.కోటేశ్వరరావు, వై.రమేష్ ఉన్నారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న దేవస్థానం అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి

నగరంపాలెం: కొద్ది రోజులు క్రితం నందివెలుగు రోడ్డు వస్తనగర్‌లోని గోదాదేవి పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యదర్శి ఎంవీ శేషగిరి రావు, కోశాధికారి మద్దినేని నాగేశ్వరరావు, సభ్యులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని దేవస్థానం కమిటీ చైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం దేవస్థాన ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వల్ప వివాదంపై దేవస్థాన ఆవరణలో ఒక భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఇలాంటి విషయాలు దేవస్థానం ఆవరణలో మాట్లాడటం సరికాదని, ఏవైనా విషయాలు ఉంటే బయట చూసుకోవాలని హితవు పలికారు. ఆర్ఎస్ఎస్ నాయకులు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగానే బయట గొడవలను దేవస్థానంలోకి తీసుకొచ్చారని అన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కూరపాటి వెంకట నరసింహారావు, కార్యదర్శి ఎంవీ.శేషగిరిరావు, కోశాధికారి మద్దినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అత్యంత మాధుర్యభరితమైనది శ్రీకృష్ణావతారం



మాట్లాడుతున్న కైలాసనాథ్

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం శ్రీకృష్ణతత్వంపై ఆధ్యాత్మిక ప్రవచనాన్ని నిర్వహించారు. ఆలయ పాలకమండలి సభ్యుల జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ అన్ని అవతారాలల్లోకి శ్రీకృష్ణావతారం అత్యంత మాధుర్యభరితమైనదని అన్నారు. కృష్ణుడు అనగా ఆకర్షించేవాడని అర్థమని చెప్పారు.

దివ్యాంగుని జీవనోపాధికి చేయూత



నగరంపాలెం: ఓ దివ్యాంగునికి బల్లా బండి అందించి, ఎన్టీఆర్ స్టేడియం ఫోర్‌ఫ్రెండ్స్ ఉదారతను చాటుకున్నారు. స్వర్ణభారతీనగర్‌కు చెందిన దివ్యాంగుడైన బందారు లక్ష్మణ్‌కు మంగళవారం బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం వద్ద చెక్క బండిని అందించారు. లక్ష్మణ్ ప్రతి రోజు అద్దె బండిపై పండ్లు విక్రయించేవాడని ఎన్టీఆర్ స్టేడియం ఫోర్‌ఫ్రెండ్స్ సభ్యులు జడ నాగేశ్వరరావు అన్నారు. విక్రయించగా వచ్చిన కొద్దిపాటి ఆదాయంలో కొంత బండి అద్దెకు చెల్లించేవాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో అతనికి అద్దె భారం కొంతైనా తగ్గించాలనే సంకల్పంతో బల్లా బండిని అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తోట పూర్ణ, తోట కోటేశ్వరరావు, మెట్రో శ్రీను, ఏలూరి నారాయణ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



మహిళతో స్కాన్ చేయించి కూటమి ప్రభుత్వ అబద్ధపు హామీలు వివరిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: మోసం– చంద్రబాబు అన్నదమ్ములని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. నియోజకవర్గంలోని 17వ డివిజన్ ఎల్ఆర్ కాలనీ, 13వ డివిజన్ పరిధిలో సంగడిగుంట, చక్రబజారులలో మంగళవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వివరించి, అమలు కాని వాగ్దానాలపై అవగాహన కల్పించారు. నూరిఫాతిమా మాట్లాడుతూ చంద్రబాబు తన జీవితం మొత్తంలో ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమం సొంతంగా ప్రవేశపెట్టారా అని ప్రశ్నించారు. ఎప్పుడూ పొత్తులతో, పనికి మాలిన రాజకీయాలు చేస్తూ గద్దెనెక్కడం తప్ప ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదని మండి పడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఇదేమని ప్రశ్నిస్తే అడిగిన వారి నాలుక మందమని వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. రానున్నరోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కోర్ కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

అమ్మవార్లకు 108 కిలోల పసుపుతో పూజ



భక్తుల ప్రత్యేక పూజలు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/4వ అడ్డరోడ్డులోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి 30వ కోటి కుంకుమార్చన ఉత్సవాలు మంగళవారం కొనసాగాయి. శ్రీచక్ర మహామేరుకు విశేషాభిషేకార్చనలు, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకార్చనలు, మండపారాధనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్లకు 108 కిలోల పసుపు పూజ వేదమంత్రాలతో విశేష హారతులు, నక్షత్ర హారతి, కోటి కుంకుమార్చనలో సువాసినులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ, అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



108 కిలోల పసుపుతో అమ్మవారికి పూజ

శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు

స్థానిక సిద్ధార్థనగర్ 11వ వీధిలోని కనక మహాలక్ష్మి మందిరంలో రెండో శ్రావణ మంగళవారం సువాసినులతో విశేష కుంకుమార్చనలు, పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. ప్రత్యేక హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులు, మహిళలకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాలను వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: ప్రాణాంతకమైన లాలాజల గ్రంధి (పారోటిడ్ కార్సినోమా) సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి అత్యంత అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. ప్రత్తిపాడుకు చెందిన అశోక్ రెండేళ్లుగా ముఖంపై గడ్డతో బాధపడుతున్నట్లు తెలిపారు. పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా సమస్య తగ్గకపోవడంతో తమ వద్దకు వచ్చారన్నారు. ఓపీలో పరీక్షలు చేసి లాలాజల గ్రంధి ట్యూమర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించామన్నారు. కొన్నిసార్లు ఈ గడ్డలు క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉందని వివరించారు. సకాలంలో ఆపరేషన్ చేయకపోతే శరీరంలోని ఇతర అవయవాలకు వ్యాప్తి చెంది ప్రాణాపాయం సంభవించే ప్రమాదం లేకపోలేదని పేర్కొన్నారు. జూన్ నెల 17న రోగిని అడ్మిట్ చేసుకుని, జూన్ 25న ఆపరేషన్ చేశామన్నారు. ఆపరేషన్ విజయవంతం అవడంతో జూలై 15న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. మంగళవారం చెకప్ కోసం ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి వచ్చాడని, సుమారు రూ.4 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేశామని తెలిపారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటు, డాక్టర్ గోవిందు నాయక్, డాక్టర్ సంతోష్, డాక్టర్ వినయ్, డాక్టర్ సంజయ్, డాక్టర్ దీక్షిత్, డాక్టర్ తేజ, మత్తు వైద్యులు పోలయ్య, శ్యాంసన్, చంద్రశేఖర్, మధుశాలిని, తానియా, నర్సింగ్ సిబ్బంది రాజ్యలక్ష్మి, స్రవంతి, లావణ్య, రజియా పాల్గొన్నట్లు వెల్లడించారు. అత్యంత అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడిన జనరల్ సర్జరీ వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందించారు. జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో అత్యంత అరుదైన శస్త్రచికిత్సలు పూర్తి ఉచితంగా చేస్తున్నామని చెప్పారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చక్రనాగ్, కోటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, బదరీ నారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ సహాయ కేంద్రం ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు దీన్ దయాళ్ ఉపాధ్యాయ సహాయ కేంద్రం వ్యవస్థాపకుడు కపిలవాయి బదరీ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. బదరీ నారాయణ మాట్లాడుతూ సహాయ కేంద్ర భవన నిర్మాణానికి ఈనెల 9న భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా భూమి పూజ కార్యక్రమ గోడ ప్రతులను ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్(అపుస్మా) జిల్లా అధ్యక్షుడు నాయుడు చక్రనాగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్, నాయుడు కోటేశ్వరరావు, రాయసం కృష్ణ కిషోర్, మీరా షహిద్, విజయ కుమార్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

బోధనకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీలు, ఉద్యోగోన్నతుల కారణంగా విద్యాబోధనకు ఆటంకం ఏర్పడిన పాఠశాలల్లో క్లస్టర్ ఉపాధ్యాయులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను డీఈఓ కార్యాలయంలో కలిసిన ఎస్టీయూ నాయకులు వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఖాళీ అయిన కొల్లిపర మండల విద్యాశాఖాధికారి పోస్టును భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో విద్యాబోధనకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు వై.శ్యాంబాబు, షేక్ బాజీ, పి. దిబ్బయ్య, యు.మహంకాళరావు, గురుబ్రహ్మం ఉన్నారు.